సాక్షి జగిత్యాల

శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



బాధ్యతలు స్వీకరించిన ఏఎస్పీ

జగిత్యాలక్రైం: జిల్లా అదనపు ఎస్పీగా ప్రభాకర్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ భాస్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



సీఎంకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు

జగిత్యాల: పంట రుణమాఫీ నిర్ణయంపై సీఎం కేసీఆర్‌ను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
29.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురు గాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

మద్యం దుకాణాల రిజర్వేషన్లపై డ్రా



డ్రా తీస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జిల్లాలోని మద్యం దుకాణాలను ఎస్సీ, గౌడ కులస్తులకు కేటాయించే రిజర్వేషన్లపై గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ యాస్మిన్ బాషా ఆధ్వర్యంలో డ్రా తీశారు. ఏ4 మద్యం దుకాణాల కేటాయింపుల్లో జిల్లాలోని 22 మద్యం దుకాణాలకు ఎస్సీ, గౌడ కులస్తులకు కేటాయించగా వాటి కోసం డ్రా తీశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శ్రీధర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

'తొలిమెట్టు' పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న సువర్ణ వినాయక్

ధర్మపురి: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర పరిశీలకుడు సువర్ణ వినాయక్ అన్నారు. గురువారం మండలంలోని తిమ్మాపూర్ ఉన్నత పాఠశాలలో ప్రైమరీ ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణా తరగతులను సందర్శించి తొలిమెట్టుపై మార్గ నిర్దేశనం చేశారు. ప్రతీ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థుల స్థాయికి తగిన సామర్థ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. శిక్షణా కాలంలో ఉపాధ్యాయులు నేర్చుకున్న పాఠ్యాంశాల ఆధారంగా విద్యార్థులందరికీ వంద శాతం అందించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బత్తుల భూమయ్య, జిల్లా సమన్వయకర్తలు కొక్కుల రాజేష్, కోరుట్ల మహేష్, అడిషనల్ కోర్సు డైరెక్టర్ చెరుకు రాజన్న, ఆర్పీలు తదితరులున్నారు.

వరద ప్రాంతాల సందర్శన



బొమ్మెన శివారు వాగులో విద్యుత్ పరికరాలను పరిశీలిస్తున్న గణపతి

కథలాపూర్/ కోరుట్ల: కథలాపూర్ మండలం బొమ్మెన, కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లి గ్రామాల శివారులో వర్షాల ఉధృతికి నష్టపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలను ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ గణపతి గురువారం పరిశీలించారు. వాగులో కొట్టుకుపోయిన పరికరాలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నష్టం ఏ మేరకు జరిగిందనే విషయాలపై చర్చించారు. ఆయన వెంట ట్రాన్స్‌కో మెట్‌పల్లి డీఈ గంగారాం, ఏడీఈలు రఘుపతి, అంజన్‌రావు, ఏఈ జమీల్‌పాషా తదితరులు ఉన్నారు.

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్నేహలత, తదితరులు

ధర్మపురి: నిరుద్యోగుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సతీమణి, ఎల్ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్ కొప్పుల స్నేహలత కోరారు. గురువారం ధర్మపురి పట్టణంలో జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. రాయపట్నం రూట్‌లో గల శ్రీలక్ష్మీనృసింహ గార్డెన్‌లో ఈనెల 13న ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తామని పేర్కొన్నారు. 60కి పైగా పెద్ద కంపెనీల్లో 4 వేలకుపైగా ఉద్యోగావకాశాలు ఉన్నాయని వివరించారు. వివరాలకు జాబ్‌మేళా కోఆర్డినేటర్ స్కిల్ రఘురామరాజు, అనంతుల లక్ష్మణ్, మామిడాల రవీందర్ 96524 04823, 79811 71917 సెల్ నంబర్‌లను సంప్రదించాలని కోరారు.

హెచ్ఎం సస్పెన్షన్

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం నమిలికొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లారెడ్డిని జిల్లా విద్యాశాఖ అధికారి జగన్మోహన్‌రెడ్డి గురువారం సస్పెండ్ చేశారు. సీసీఏ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినందుకు సస్పెండ్ చేసినట్లు ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు.

కాటేస్తున్న కరెంట్

- రాయికల్ మండలం కుర్మపల్లి గ్రామానికి చెందిన ఆది కళ్యాణ్ అనే 23 ఏళ్ల యువకుడు జూలై 19న విద్యుత్ మోటార్ ఆన్ చేస్తుండగా షాక్‌తో మృతిచెందాడు.
- రాయికల్ మండలంలోని అలూరు గ్రామానికి చెందిన 31 ఏళ్ల పిట్టల రాకేశ్ జూలై 10న కరెంట్ మోటార్ స్టార్ట్ చేస్తుండగా విద్యుత్ షాక్‌తో దుర్మరణం చెందాడు.
- బీర్‌పూర్ మండలం కోల్వాయికి చెందిన 19 ఏళ్ల కనుక శ్రీనివాస్ జూలై 7న పొలం వద్ద విద్యుత్ మోటార్ ఆన్ చేస్తుండగా షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు.

- స్టార్టర్ డబ్బాలు, విద్యుత్‌మోటార్లే యమపాశాలు
- చిన్నచిన్న రిపేర్లతో ప్రాణాల మీదకు..
- ఆరునెలల్లో 14 మంది, 29 పశువులు మృత్యువాత



రాయికల్ మండలంలో విద్యుదాఘాతంతో మృతిచెందిన రైతు, కాడెద్దు (ఫైల్)

జగిత్యాలఅగ్రికల్చర్: వానాకాలం వచ్చిందంటే చాలు జిల్లాలో ఎక్కడో ఓ చోట విద్యుత్ ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. ఆరు నెలల్లోనే జిల్లాలో కరెంట్ షాక్‌తో 14 మంది చనిపోయారు. 29 పశువులు మృత్యువాతపడ్డాయి. ఇటు రైతుల నిర్లక్ష్యం అటు విద్యుత్ శాఖ అలసత్వంతో ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు.

3 లక్షల విద్యుత్ మోటార్లు

జిల్లాలో బావులు, బోర్ల ద్వారానే వ్యవసాయం. రైతులు దాదాపు 3 లక్షల విద్యుత్ పంపుసెట్లు బిగించుకున్నారు. కరెంట్ మోటార్లు ఆన్ చేసే సమయంలోనే మరణాల శాతం ఎక్కువగా ఉంటోంది. దీనికి తోడు క్షేత్రస్థాయిలో హెల్పర్లు, లైన్‌మెన్‌లు సరిపడా లేక రైతులే ట్రాన్స్‌ఫార్మర్లపై ఫ్యూజులు వేసేందుకు ఎక్కి ప్రాణాలు వదులుతున్నారు. అలాగే గృహ వినియోగదారులు ఇనుప వైర్లపై బట్టలు ఆరవేయడం అవి విద్యుత్ వైర్లకు తాకడంతో ప్రాణాలు పోతున్నాయి. కరెంట్ పని రాకున్నా చిన్నచిన్న కరెంట్ రిపేర్లు చేస్తూ మృత్యువాత పడుతున్నారు. బలమైన ఈదురుగాలులకు లూజు వైర్లు తెగడం, తెగిన విషయం తెలియక దానికి తాకి మనుషులు చనిపోతుండగా, పశువులు మృత్యువాత పడుతున్నాయి.

మరమ్మతు చేసినా..

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పల్లె ప్రగతిలో భాగంగా గ్రామాల్లోనే అవసరమైన చోట కొత్త స్తంభాలు వేసి లూజ్ వైర్లు సరి చేశారు. కానీ ఎక్కువగా పొలాల వద్ద జరిగే విద్యుత్ ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో మోటార్ పనిచేయకుంటే వైరు అటు ఇటు పెట్టడం చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారు. ఫ్యూజ్ బాక్స్ పెట్టే ఇనుప డబ్బాలోనికి ఎలకలు వెళ్లి వైర్లు కొరకడం వంటివి జరుగుతుంటాయి. ఈ విషయం తెలియక రైతులు మోటార్‌ను ఆన్ ఆఫ్ చేసే సమయంలో స్టార్టర్ బాక్స్‌కు విద్యుత్ ప్రసారం జరిగి షాక్‌తో చనిపోతున్నారు.

ప్రమాదాలపై అధికారుల ఆరా..

విద్యుత్ ప్రమాదాలు ఎలా జరుగుతున్నాయనే దానిపై జిల్లా విద్యుత్ శాఖ పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు అందించింది. ఈ మేరకు రైతులు మోటార్ల వద్ద సరైన ఎర్త్ వైర్ కనెక్షన్ బిగించకపోవడం, నాణ్యమైన సర్వీస్ వైరు, ఫ్యూజ్‌కు టంగ్‌స్టన్ వైరు వాడకపోవడం, సరైన రక్షణ పైపులు లేకుండా కరెంట్ తీగలను భూమిపై పరచడం, విద్యుత్ తీగల అమరిక తెలియక ఇష్టం వచ్చినట్లు అమర్చడం, వర్షం కురిసే సమయంలో ఫ్యూజ్‌లను సరిచేయడం చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని తేల్చారు.

కంట్రోల్ రూం

విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. జగిత్యాల డివిజన్ కంట్రోల్ రూం 94408 11398, మెట్‌పల్లి డివిజన్ 79016 78208, జిల్లా కేంద్రంలోని జగిత్యాల సర్కిల్ కంట్రోల్ రూం 79016 28366, టోల్ ఫ్రీ నంబర్ 18004250028 లేదా 1912కు ఫోన్ చేయవచ్చు.

అవగాహన కల్పించాలి



విద్యుత్‌షాక్‌తో మృతి చెందుతున్న రైతుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మోటార్, స్టార్టర్ వద్ద ఎలాంటి పనులు చేయవచ్చు, ఏ పనులు చేయవద్దనే విషయాల గురించి రైతులకు అవగాహన కల్పించాలి. పొలం వద్ద మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లిన రైతు ఇంటికి వస్తాడో రాడో తెలియని పరిస్థితి నెలకొంది.

– గణపతి, దొంతాపూర్, ధర్మపురి

సమస్యలు పరిష్కరిస్తున్నాం



విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. ఎక్కడైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకరావాలని కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశాం. విద్యుత్ మోటార్ల వద్దే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నందున రైతులను చైతన్యం చేసే కార్యక్రమాలు చేపడుతున్నాం.

– సత్యనారాయణ, జిల్లా విద్యుత్ శాఖ అధికారి

రుణమాఫీపై బీఆర్ఎస్ సంబరాలు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వసంత, నాయకులు

జగిత్యాలటౌన్: రైతు రుణమాఫీ అమలుకు సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేయడంతో బీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో టపాసులు కాల్చి, సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ అమలు చేస్తున్నారని వివరించారు. సీఎం ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రూరల్ ఎంపీపీ పాలెపు రాజేంద్రప్రసాద్, రైతుబంధు సమితి అధ్యక్షుడు నక్కల రవీందర్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రచయితల వేదిక నూతన కార్యవర్గం

జగిత్యాల జోన్: తెలంగాణ రచయితల వేదిక జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నాగారం డి.ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి కట్టా వేణు, ఉపాధ్యక్షులు డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, నేరెళ్ల శ్రీనివాస్‌గౌడ్, కటుకోజ్వల మనోహరాచారి, ఐత అనిత, కోశాధికారి ఎర్రోజుల రాజమౌళి, ప్రచార కార్యదర్శి గాలిపెల్లి చోళేశ్వర చారి, కార్యనిర్వాహక కార్యదర్శి ఓదెల గంగాధర్, మహిళా కార్యదర్శిగా మార విజయలక్ష్మి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా రాపర్తి శ్రీనివాస్, చిగురు రమేశ్, సంద రాజేందర్, డాక్టర్ రఘువర్మ, రుద్ర మాణిక్యం, కొక్కుల వెంకటరమణ, జెట్టి లక్ష్మినర్సయ్య, లక్కరాజు శ్రీలక్ష్మి, అంకం దామోదర్, ఎం.శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

ముందుచూపేది..?



ఇటీవల మత్తడి దూకుతున్న రాళ్లవాగు ప్రాజెక్టు



ప్రాజెక్టు కుడికాలువకు గండి పడి వృథాగా పోతున్న నీరు

- ఏటా తెగుతున్న రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువ.. వృథాగా నీరు
- వారం క్రితం మళ్లీ గండి.. ఆందోళనలో రైతులు
- శాశ్వత మరమ్మతు చేపట్టాలని విన్నపం

కథలాపూర్(వేములవాడ): రైతు సంక్షేమమే ధ్యేయమని, పంటలకు సాగునీరందించడమే లక్ష్యమని ప్రసంగాలు అదరగొడుతున్న పాలకులు ఆచరణలో మాత్రం అంతంతగానే ఉన్నారని రైతులు విమర్శిస్తున్నారు. కథలాపూర్ మండలంలోని గ్రామాలకు సాగునీరందించే రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువకు తరుచూ గండి పడి నీరంతా వృథాగా పోతున్నా శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు. కాలువకు గండిపడితే తాత్కలికంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకొంటున్నారని, శాశ్వత పరిష్కారం చూపకపోవడం దారుణమని వాపోతున్నారు.

3,500 ఎకరాలకు సాగునీరు

వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు జిల్లా సరిహద్దులో గల రాళ్లవాగు ప్రాజెక్టులోకి పుష్కలంగా నీళ్లు చేరాయి. ఈ ప్రాజెక్టు నుంచి కుడికాలువ ద్వారా కథలాపూర్ మండలం భూషణరావుపేట, కథలాపూర్, కోనాపూర్, ఆత్మకూర్, ఊటపెల్లి, పెగ్గెర్ల గ్రామాల పరిధిలోని 3,500 ఎకరాలకు సాగునీరందించడం లక్ష్యం. వారం క్రితం కురిసిన వర్షాలకు ప్రాజెక్టులో పూర్తిగా నీళ్లు చేరడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమైంది.

కాలువకు గండి.. ఆందోళనలో రైతులు

రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువకు ఏటా గండి పడటంతో నీరంతా వృథాగా పోతుందని ఆయకట్టు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో పలుమార్లు కోనాపూర్– భూషణరావుపేట గ్రామాల మధ్య కుడికాలువకు గండిపడటంతో మరమ్మతు చేశారు. వారం క్రితం కురిసిన వర్షానికి మళ్లీ గండిపడటంతో నీరంతా వృథాగా పోతుందని రైతులు పేర్కొన్నారు. గండిపడిన చోట నుంచి నీళ్లు పంటపొలాలకు వెళ్లడంతో రైతులకు నష్టం వాటిల్లుతుంది. ప్రభుత్వం, నీటిపారుదలశాఖ అధికారులు చొరవ చూపి కుడికాలువకు గండిపడకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



ప్రాజెక్టును నిర్మించి సుమారు 14 ఏళ్లు అవుతుంది. కుడికాలువలో నీళ్లు వదిలితే నక్కల ఒర్రె ప్రాంతంలో ఎప్పుడూ గండిపడుతుంది. ఈ విషయం ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలుసు. కాలువ సరిగా లేకపోవడంతో ఆయకట్టు రైతులకు నీళ్లందడం కలగానే మిగిలిపోనుంది. కుడికాలువకు గండిపడే అవకాశాలు ఉన్న చోట ఎండకాలంలో సిమెంట్ నిర్మాణాలు చేపడితే బాగుండేది. గండిపడిన స్థలంలో శాశ్వత మరమ్మతులు చేయాలి.

– గడ్డం రాజారెడ్డి, రైతు, భూషణరావుపేట

నిర్లక్ష్యం సరికాదు



ఏటా కురిసిన వర్షాలకు రాళ్లవాగు ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లు చేరుతున్నాయి. కానీ ఆయకట్టు రైతులకు రెండు పంటలకు నీళ్లందించడంలేదు. ఇదీ ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్యమే. ఏళ్లుగా కాలువకు గండిపడుతున్నా శాశ్వత పరిష్కారం చూపడంలేదు. ఎన్నికలప్పుడు ఆయకట్టు రైతులకు హామీ ఇచ్చినవారు ఇప్పటికీ పరిష్కరించకపోవడం దారుణం. కాలువను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి ఆయకట్టు రైతులకు సాగుపై భరోసా కల్పించాలి.

– రిక్కల తిరుపతిరెడ్డి, రైతు, కథలాపూర్

మరమ్మతు చేయిస్తాం



రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువకు వారం క్రితం గండి పడింది. గండిపడిన చోట తాత్కాలిక మరమ్మతులు చేయిస్తాం. శాశ్వత పరిష్కారం కోసం కుడికాలువకు సీసీ నిర్మాణం, కాలువపై అక్కడక్కడ వంతెనలు కొత్తగా నిర్మించాలని నిర్ణయించి ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రతిపాదనలకు అనుగుణంగా నిధులు మంజూరైతే పనులు చేపట్టి ఆయకట్టు రైతులకు ఇబ్బందిలేకుండా నీళ్లందించవచ్చు.

– ప్రశాంత్‌కుమార్, నీటిపారుదలశాఖ డీఈ

నులిపురుగుల నివారణ సామాజిక బాధ్యత

- డీఎంహెచ్‌వో శ్రీధర్



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌వో

జగిత్యాల: నులిపురుగుల నివారణ సామాజిక బాధ్యతగా గుర్తించి, 1–19 సంవత్సరాల లోపు వారికి అల్బెండాజోల్ మాత్రలు తప్పకుండా వేయాలని జిల్లా వైద్యాధికారి శ్రీధర్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలనలో భాగంగా గురువారం జగిత్యాలలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నులిపురుగులు కడుపులో పెరిగితే మానసిక ఎదుగుదల లోపిస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

మల్యాల మండలంలో..

మల్యాల(చొప్పదండి): మండలంలోని నూకపల్లి మోడల్ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శ్రీధర్ పరిశీలించి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో డాక్టర మౌనిక, డీపీఎంఓ దేవీసింగ్, పీహెచ్ఎన్ నాగలక్ష్మి, సూపర్‌వైజర్ సునంద, ఎంపీహెచ్ఏ వేణు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

- అదనపు కలెక్టర్ దివాకర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దివాకర్

జగిత్యాల: మన ఊరు– మన బడి కింద చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దివాకర్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పనులపై విద్యాశాఖ, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ ఇరిగేషన్ అధికారులు, వివిధ మండలాల ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా బీర్పూర్, జగిత్యాల రూరల్, కోరుట్ల, మల్యాల, మేడిపల్లి, సారంగాపూర్, వెల్గటూర్ మండలాల్లోని 27 పాఠశాలల్లో పనుల పురోగతిపై సమీక్షించారు. ఇరిగేషన్ శాఖ ద్వారా బుగ్గారం, జగిత్యాల అర్బన్, కథలాపూర్ మండలాలల్లో 5 పాఠశాలల్లో పనులపై వివరాలు తెలుసుకున్నారు. పనులన్నింటినీ ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని సూచించారు. సమీక్షలో జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి



సమావేశంలో పాఠశాల క్రీడా సమాఖ్య సభ్యులు

జగిత్యాలటౌన్: విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖ అధికారి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా స్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా డీఈవో మాట్లాడారు. జిల్లా స్థాయి క్రీడలకు పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. గతంలో ఎస్‌జీఎఫ్ సెక్రెటరీగా పని చేసిన శ్రీనివాస్ తన 2 సంవత్సరాల పీరియడ్‌లో నిర్వహించిన క్రీడా పోటీల వివరాలు, కార్యదర్శి నివేదికను సమావేశంలో చదివి వినిపించారు. అనంతరం ఎస్‌జీఎఫ్ నూతన సెక్రెటరీగా లక్ష్మీరాంనాయక్‌ను డీఈవో నియమించారు. సమావేశంలో పెటా అధ్యక్ష, కార్యదర్శులు పడాల విశ్వప్రసాద్, ఎస్.అశోక్, పీఈటీలు కృష్ణప్రసాద్, భాస్కర్‌రెడ్డి, అజయ్‌బాబు, తిరుమలేశ్, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించండి

జగిత్యాలక్రైం: రాష్ట్రంలో హోంగార్డులుగా చాలీచాలనీ జీతాలతో ఉద్యోగ భద్రత కరువైందని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని గురువారం రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు తెలంగాణ హోంగార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సత్తయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం హోంగార్డు ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తామని సీఎం హామీ ఇచ్చారని, అలాగే భక్త రామదాసు ప్రాజెక్టు, అసెంబ్లీలో బీఆర్ఎస్ భవన నిర్మాణ సమయాల్లో పోలీస్‌శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో హోంగార్డులను పర్మినెంట్ చేస్తామని సీఎం మాట్లాడారని గుర్తు చేశారు. ప్రజా రక్షణకు పాటుపడుతున్న తమ శ్రమను గుర్తించి, అసెంబ్లీ సమావేశంలో ఉద్యోగ భద్రతపై ప్రకటన వచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రిని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

గొల్లపల్లి(ధర్మపురి): సమస్యలు పరిష్కరించాలని మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల అతిథి ఉపాధ్యాయులకు మిగతా గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల మాదిరిగా వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రవీణ్‌కుమార్, జె.ప్రవీణ్, సాగర్, డి.వెంకటేశ్, ఎం.మల్లేశ్ తదిరుతలు పాల్గొన్నారు.

మ్యాదారంతండాలో తీజ్ వేడుకలు



సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని మ్యాదారంతండాలో గురువారం తీజ్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వెదురుబుట్టల్లో వారం క్రితం నానబెట్టిన గోధుమనారుతో తమ సంప్రదాయ ఆటలు ఆడి సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం దివ్యభారతి, ట్రాన్స్‌కో ఏడీఈ జవహర్‌లాల్‌నాయక్, రాష్ట్ర బంజారా సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ భూక్య దశరథ్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ భూక్య సరళ, ఎంపీటీసీ భూక్య లావణ్యరాథోడ్, సర్పంచ్ భూక్య అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

జగిత్యాలక్రైం: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. గురువారం సైబర్ నేరాలు, సైబర్ భద్రతపై జాగృక్త దివస్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సైబర్ నేరాలను నివారించడమే పోలీసుల లక్ష్యమన్నారు. విద్యార్థులు, యువతకు, ప్రజలకు సైబర్ క్రైంపై అవగాహన కల్పించడంలో భాగంగా తెలంగాణ పోలీస్ ఆధ్వర్యంలో సైబర్ జాగృత్ దివస్ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటస్వామి, రవీందర్ రెడ్డి తితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలకేంద్రంలో బుధవారం అర్ధరాత్రి 3 దుకాణాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితుల కథనం ప్రకారం .. మెయిన్ రోడ్డులోని పాత యూనియన్‌బ్యాంక్ ముందు గల ఆసీస్ సెల్‌పాయింట్‌లో రూ.48వేల నగదు, సుమారు రూ. 20వేల విలువ గల బ్లూటూత్ హెడ్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. కొత్త బస్టాండ్ వద్ద మట్టెల మురళికి చెందిన షాప్ తాళాన్ని పగుల కొట్టి రూ.2వేల విలువ గల సెల్‌ఫోన్, పసునూరి మురళికి చెందిన సెలూన్ షాప్ తాళం పగులకొట్టి రూ.వెయ్యి చోరీ చేశారు. ఎస్‌ఐ ఉమసాగర్ ఘటన స్థలాలను పరిశీలించారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా, క్లూస్ టీం వేలిముద్రలను సేకరించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి



సభ్యత్వ నమోదులో సంఘం నాయకులు

ధర్మపురి: విద్యారంగ సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూటీఎఫ్ కృషి చేస్తుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినిపెల్లి ఆనందరావు అన్నారు. మండలంలోని ఆరెపెల్లి, దొంతాపూర్, తీగలధర్మారం, నక్కలపేట, మగ్గిడి ఆదర్శ, ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవో 317 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం వర్క్ అడ్జస్టింట్లు ఆపి రేషనైజేషన్ చేసి సుదూర ప్రాంతాలకు వెళ్లిపోయిన ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. పీఆర్సీ కమీషన్ వేసి మధ్యంతర భృతి ప్రకటించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేందర్‌రెడ్డి, దత్తాత్రి, ఉపాధ్యక్షుడు భూపాల్‌రావు తదితరులున్నారు.

మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్

ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని శివపల్లి శివారు గుట్ట నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న ఒక జేసీబీ, రెండు మినీ టిప్పర్లను గురువారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ స్వర్ణ తెలిపారు. అనుమతి లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంచాయతీల్లో యూపీఐ సేవలు

- నగదురహిత చెల్లింపుల దిశగా చర్యలు
- పారదర్శకత కోసమే అంటున్న అధికారులు



పోరుమల్ల గ్రామపంచాయతీ కార్యాలయం

కథలాపూర్(వేములవాడ): గ్రామపంచాయతీల్లో జరిగే అభివృద్ధి పనులు, పన్నుల వసూలు ఎంత అంటే రికార్డులు చూసి వివరాలు వెల్లడించాల్సిన పరిస్థితి. రోజురోజుకు టెక్నాలజీ అభివృద్ధి కావడంతో పంచాయతీలను బలోపేతం చేయడం, డిజిటల్ పరంగా మరింత ముందుకు నడిపించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుంది. గ్రామాల్లో ప్రజలు పన్నులను నగదు రూపంలో చెల్లింపులు చేస్తుంటారు. ప్రస్తుత రోజుల్లో కూరగాయలు, ఇతర వస్తువులు కొనుగోలు చేసేందుకు యూపీఐ(యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) సేవలను వినియోగిస్తున్నారు. దీంతో పంచాయతీల్లో సైతం యూపీఐ సేవలను అందించేందుకు కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు.

పల్లెల్లోనూ పెరిగిన డిజిటల్ సేవలు

కరోనా తర్వాత మారుమూల పల్లెల్లో సైతం యూపీఐ సేవలు వినియోగించేవారి సంఖ్య పెరిగింది. డిజిటల్ సేవలకు అలవాటు పడిన చిరు వ్యాపారులు, దుకాణాల యజమానులు యూపీఐ సేవలను వినియోగిస్తున్నారు. ప్రతీ వస్తువు కొనుగోలు చేసే సమయంలో చిల్లర డబ్బులు లేకపోవడంతో ప్రజలు, దుకాణాల యజమానులు ఇబ్బందిపడేవారు. ప్రస్తుతం చాలా మంది వద్ద స్మార్ట్ ఫోన్ ఉండటంతో ఇప్పుడు చిల్లర డబ్బులకు యూపీఐనే వినియోగిస్తుండటం విశేషం. ఇందులో భాగంగానే ప్రజలకు మరింత చేరువయ్యేందుకు నగదు రహిత చెల్లింపులకు ప్రతీ గ్రామపంచాయతీలో యూపీఐ సేవలను తెచ్చేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది.

అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకే..

జిల్లాలో 20 మండలాలుండగా, 380 గ్రామపంచాయతీలున్నాయి. ఏటా ఇంటిపన్ను సుమారు రూ.12 కోట్లు సమకూరుతోంది. ఇప్పటికే మేజర్ గ్రామపంచాయతీలల్లో వివిధ రకాల అభివృద్ధి పనులకు, బిల్లుల చెల్లింపులకు, ధ్రువీకరణ పత్రాల జారీకి ఆన్‌లైన్ సేవలు వినియోగిస్తున్నారు. చాలా పంచాయతీల్లో పన్నుల వసూళ్లు మాత్రం నగదు రూపంలో ఇప్పటికీ చేస్తున్నారు. దీంతో వసూలైన పన్నులు వివిధ అభివృద్ధి పనులు, ఖర్చుల పేరుతో రికార్డుల్లో నమోదు చేసి పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ఇకనుంచి పన్నుల వసూలు, కొత్త ఇంటి నిర్మాణ అనుమతులు, జనన, మరణ సర్టిఫికెట్ల జారీకి పంచాయతీల్లో యూపీఐ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. ఫలితంగా అక్రమాలకు అడ్డుకట్ట వేసినట్లవుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

యూపీఐతో పారదర్శకత



గ్రామాల్లో సైకిళ్లపై కూరగాయలు విక్రయించే వారు క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ పేమెంట్లను స్వీకరిస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో యూపీఐ సేవలు అందుబాటులో ఉండాల్సిందే. పంచాయతీలు అందించే వివిధ సేవలకు పన్నులను యూపీఐ ద్వారా చెల్లిస్తే పారదర్శకత ఉంటుంది. జవాబుదారీతనం పెరిగి అక్రమాలను అరికట్టవచ్చు. – నల్ల గంగాధర్, కథలాపూర్

కొనసాగుతున్న ప్రక్రియ



గ్రామపంచాయతీల్లో పన్నులు, ఇతర పనులకు యూపీఐ సేవలను అమలు చేయాలని కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రం మార్గదర్శకాల ప్రకారం పంచాయతీలకు తగిన సర్వీస్ ప్రొవైడర్లను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాక పంచాయతీల్లో నగదు రహిత సేవల వల్ల వ్యవస్థ పారదర్శకంగా మారుతుంది. ఈ ప్రక్రియ కొనసాగుతుంది. – దేవరాజ్, జిల్లా పంచాయతీ అధికారి

పోరుమల్ల వాసికి డాక్టరేట్



మారుతి

కథలాపూర్(వేములవాడ): మేడిపెల్లి మండలం పోరుమల్ల గ్రామానికి చెందిన శ్రీపతి మారుతికి కేంద్రీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. తెలుగు సాహిత్యంలో ప్రముఖ రచయిత్రి ×ముదిగంటి సుజాతారెడ్డి విమర్శ ధోరణులు– పరిశీలన× అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ వరించింది. మారుతి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే పదోతరగతి వరకు చదివాడు. రాయికల్‌లో ఇంటర్ పూర్తి చేశాడు. ఈసందర్భంగా అతడిని గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీఈటీ

కోరుట్లరూరల్: కోరుట్ల మండలం అయిలాపూర్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఓరుగంటి సింధూజ, మర్ల భారతి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం లోకిని శ్రీనివాస్ గురువారం తెలిపారు. మెట్‌పల్లిలో జరిగిన జిల్లాస్థాయి జావలిన్ త్రోలో విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ నెల 7న హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను సర్పంచ్ పిడుగు రాధ, పీఈటీ రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతు సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ధర్మపురి: రైతు సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయమని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రైతులు వ్యవసాయం కోసం తీసుకున్న క్రాప్‌లోన్లు రూ.లక్ష వరకు ముఖ్యమంత్రి మాఫీ చేయడంపై హర్షిస్తూ ధర్మపురి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్ల చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, గతంలో ఏ ప్రభుత్వాలు చేయని పనులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసి చూపిస్తుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేష్, పట్టణ అధ్యకుడు ఆకుల రాజేష్, కౌన్సిలర్లు, నాయకులు భీమన్న తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగిత్యాల: ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అసెంబ్లీ ఆవరణలో తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ గురువారం కలిశారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై విన్నవించినట్లు జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్, జిల్లా కార్యదర్శి నాగేందర్‌రెడ్డి తెలిపారు. 2023 నుంచి పీఆర్సీ కమిటీ వేసి ఐఆర్ ప్రకటించడం, ఎంప్లాయిస్ హెల్త్ స్కీం అమలు, సీపీఎస్ రద్దు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారని పేర్కొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సన్మానిస్తున్న సంఘం సభ్యులు

మెట్‌పల్లి(కోరుట్ల): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గంగపుత్రులు సద్వినియోగం చేసుకోవాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లికొండ ప్రవీణ్ సూచించారు. పట్టణంలోని సంఘ భవనంలో గురువారం పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ప్రవీణ్‌తో పాటు డైరెక్టర్‌గా ఎన్నికైన పర్రె శంకర్, లీగల్ అడ్వయిజర్ అరవింద్‌ను సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో పారిపెల్లి కిషన్, నరేందర్, సాయన్న, మగ్గిడి సురేష్ తదితరులున్నారు.

వైభవంగా భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞం



భాగవత సప్తాహంలో పట్టణ ప్రజలు

జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణంలోని వాసవీ కల్యాణ మంటపంలో నిర్వహిస్తున్న భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞం కార్యక్రమం గురువారం నాల్గో రోజు వైభవంగా సాగింది. శృంగేరి శారదాపీఠం ఆస్థాన పౌరాణికుడు డాక్టర్ బాచంపెల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. ప్రవచనాల్లో భాగంగా నరసింహ అవతార ఘట్టం శ్రోతలను ఆకట్టుకుంది. గజేంద్రమోక్షం, వామన చరిత్ర ఘట్టాలను హృదయాలకు హత్తుకునేలా వివరించారు. అధిక మాసాన్ని పురస్కరించుకుని వత్తులు ముట్టించారు. హారతి అనంతరం స్వామి ప్రసాదంగా అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో ఊటూరి ఓంకార్‌నాథ్, నవత, సామాజిక కార్యకర్త తవుటు రాంచంద్రం, పురోహితులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు షీ టీం నిరంతర కృషి



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

జగిత్యాలక్రైం: మహిళల రక్షణకు షీ టీం నిరంతరం కృషి చేస్తుందని సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్ స్కూల్‌లో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలపై జరిగే నేరాలపై వెంటనే బాధితులు పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళల భద్రత, ఆకతాయిల వేధింపుల నుంచి రక్షణకు పోలీసు శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మహిళలు, యువతులు ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా షీ టీం నంబరు 87126 70783 సంప్రదించాలన్నారు. ఫేస్ బుక్, వాట్సప్, ఇన్‌స్టాగామ్‌ల వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే టోల్ ఫ్రీ నంబరు 1930 లేదా డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగసుధారాణి, ఏఎస్సై అలీబేగ్, మహిళ కానిస్టేబుళ్లు సౌజన్య, మంజూ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతోనే సమస్యలు పరిష్కారం



సభ్యత్వ నమోదులో సంఘం నాయకులు

జగిత్యాల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యమవుతుందని ఈసంఘం జిల్లా అధ్యక్షుడు యాళ్ళ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. పీఆర్‌టీయూ సభ్యత్వ వారోత్సవాల్లో భాగంగా గురువారం జగిత్యాల అర్బన్ మండలాల్లో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యలు త్వరలోనే పరిష్కరింపబడుతాయని, పెండింగ్ బిల్లుల సమస్యకు కూడా పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేవారు. 2003 డీఎస్సీ వాళ్లకు ఈ నెల 31 లోపు పాత పెన్షన్, అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేసేలా హెల్త్ కార్డులను తీసుకవస్తామని పేర్కొన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు టైమ్‌స్కేల్ ఇప్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జగిత్యాల అర్బన్ మండల అధ్యక్షుడు అబ్దుల్ బాసిత్, నాయకులు వూటూరి మహేష్, సత్యరాజ్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు



ఆపరేషన్ నైట్ సేఫ్టీలో భాగంగా తనిఖీలు చేస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని పట్టణ సీఐ నటేశ్ అన్నారు. జిల్లా ఎస్పీ భాస్కర్ ఆదేశాల మేరకు బుధవారం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలో రోడ్లపై అనవసరంగా తిరుగుతున్న వారే లక్ష్యంగా ఆపరేషన్ నైట్ సేఫ్టీ కార్యక్రమం నిర్వహించారు. 8 టూ వీలర్లు, ఒక కారును సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసాంఘిక కార్యకలాపాల నివారణే లక్ష్యంగా అర్ధరాత్రి వేళల్లో ఆపరేషన్ నైట్ సేఫ్టీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. అర్ధరాత్రి మద్యం తాగి అనవసరంగా రోడ్లపైకి వచ్చి ప్రజలపు ఇబ్బందులకు గురిచేస్తే పోలీస్‌శాఖ కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడే అవకాశం ఉందని, తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.

నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలి



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న సమియొద్దీన్

కథలాపూర్(వేములవాడ): 19 ఏళ్లలోపు వారందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని, అందుకు తల్లిదండ్రులు సహకరించాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఎండీ సమియొద్దీన్ పేర్కొన్నారు. గురువారం మేడిపెల్లి మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. వైద్యాధికారి ప్రవీణ్‌చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్మపురి: నేతకాని మహార్ కుల సంఘ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టేకుమట్ల ప్రభాకర్ అన్నారు. మండలంలోని ఆరెపెల్లి గ్రామంలో గురువారం జిల్లా అధ్యక్షుడు పిప్పలా గంగారాజంతో కలిసి భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. నేతకాని కుల హక్కుల సాధనకు ఏకతాటిపై నిలవాలని పిలుపునిచ్చారు. యూత్ మండల అధ్యక్షుడు అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్‌పై దాడి



గాయపడిన రవితేజ

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణానికి చెందిన డాక్యుమెంట్ రైటర్ మాదస్తు రవితేజపై గురువారం గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. తన ఆఫీస్‌లో పని చేసుకుంటున్న సమయంలో కొందరు అక్కడకు వచ్చి ఒక్కసారిగా దాడి చేశారు. ఈ ఘటనలో అతడికి పలు చోట్ల గాయాలయ్యాయి. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అట్రాసిటి కేసుపై డీఎస్పీ విచారణ



విచారణ చేస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మల్లాపూర్(కోరుట్ల): మండల కేంద్రంలో అట్రాసిటి కేసుపై గురువారం మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన బంజార తండా గిరిజనులు గత నెల 18న బోడగుట్ట వద్ద శీత్లాభవాని విగ్రహాలను ప్రతిష్టించుకుని వేడుకలను జరుపుకోగా, విగ్రహాలను మొగిలిపేటకు చెందిన దండవేణి రాజేందర్, సంగెం–శ్రీరాంపూర్‌కు చెందిన దేవర సురేశ్‌రావు, ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన పెండ్యాల చిన్నసాయన్న భూమిని చదును చేసే క్రమంలో ధ్వంసం చేశారని బంజార తండాకు చెందిన భూక్య తేజు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ముగ్గురు నిందితులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆట్రాసిటి కేసు నమోదయింది. ఈ క్రమంలో డీఎస్పీ మండల కేంద్రంలో పర్యటించి ఫిర్యాదు దారుడితో పాటు ప్రత్యక్ష సాక్షులను విచారించారు. విచారణలో మల్లాపూర్ ఎస్సై నవీన్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవనభృతి ప్రకటనపై హర్షం



క్షీరాభిషేకం చేసి నినాదాలు చేస్తున్న నాయకులు

మల్లాపూర్(కోరుట్ల): బీడీ టేకేదార్లకు రూ.2016 జీవనభృతి ప్రకటించడం హర్షణీయమని తెలంగాణ రాష్ట్ర బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ.మౌలానా అన్నారు. గురువారం మండల కేంద్రంలో టీఆర్‌బీకేఎస్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎన్నో ఏళ్లుగా బీడీ ఏజెంట్లుగా పనిచేస్తున్న టేకేదార్లను గుర్తించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆలీ, మండల అధ్యక్షుడు గూడెల్లి రాజన్న, బీడీ టేకేదార్లు సిరిపురం భూమేశ్వర్, మిట్టపెల్లి దివాకర్‌రెడ్డి, సత్యానారయణ, ఆనంద్, రాజన్న, రమణ, సుధాకర్, మురళి, ప్రతాప్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామ శివారులో జగిత్యాల–నిజామాబాద్ ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పూదరి శంకరయ్య(72) చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. తాటిపల్లికి చెందిన శంకరయ్య ఆయన భార్య గంగవ్వ ద్విచక్రవాహనంపై పని నిమిత్తం బయటకు వెళ్లి, రాత్రి ఇంటికి వస్తుండగా వెనక నుంచి ధర్మపురి మండలం జైన గ్రామానికి చెందిన అజయ్ బైక్‌తో ఢీకొట్టాడు. స్థానికులు శంకరయ్య, గంగవ్వను 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా శంకరయ్య మృతిచెందాడు. మృతుడి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు అజయ్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి ఆలయంలో యాగం



యాగం చేస్తున్న అర్చకులు, భక్తులు

కోరుట్ల: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అధిక శ్రావణమాసం సందర్భంగా గురువారం త్రయాహ్నిక పంచకుండాత్మక యాగం నిర్వహించారు. అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం మహాలింగార్చన నిర్వహించారు. ఉత్సవాల్లో అర్చకులు, నాయకులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల: మండలంలోని ముత్యంపేటలో 33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ సీహెచ్. బాలలింగం తెలిపారు. కొండగట్టు, తాటిపల్లి, తక్కళ్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారుల సహకరించాలన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కథలాపూర్: భీమారం మండలంలోని కమ్మరిపేటలో చల్మెడ ఆనందరావు వైద్యవిజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని 210 మందికి చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు. ఇందులో 65 మందికి మెరుగైన వైద్యంకోసం కరీంనగర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్, బీఆర్ఎస్ నియోజకవర్గ నేత చల్మెడ లక్ష్మీనరసింహరావు, సర్పంచ్ పిట్టల లక్ష్మి, నాయకులు శ్రీనివాస్ రావు, అంగడి ఆనంద్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్ల గ్రామానికి చెందిన బాపురపు లక్ష్మణ్ ఇల్లు వర్షానికి కూలింది. గురువారం బాధితుడికి బీఆర్ఎస్ నియోజకవర్గ నేత గోలి మోహన్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఇల్లు కోల్పోయిన బాధితుడికి ఇల్లు నిర్మించుకునేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఆయనవెంట నాయకులు పోకతోట రాజం, ఆనంద్ ఉన్నారు.

సంఘం భవనానికి స్థలం కేటాయించాలి

మెట్‌పల్లి: డివిజన్ పెయింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన నిర్మాణం కోసం పట్టణంలో స్థలం కేటాయించాలని కోరుతూ సభ్యులు గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్‌కు వినతిపత్రం అందజేశారు. భవనం లేకపోవడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అధ్యక్షుడు ఏళమేని గణేశ్, సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా

ఇబ్రహీంపట్నం : మండల బీజేపీ ఉపాధ్యక్షుడు పుప్పాల నాగేశ్ పార్టీకి, ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. సీఎం కేసీఆర్ కనుసన్నల్లోనే బీజేపీ పార్టీ నడుస్తోందని రాబోయే రోజుల్లో బీజేపీ కనుమరుగు కావడం ఖాయమన్నారు.

పశువైద్య శిబిరం

పెగడపల్లి: మండలంలోని ఆరవెల్లిలో గురువారు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. గాలికుంటు, నట్టల నివారణకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు పశు వైద్యాధికారి విక్రమ్ తెలిపారు. సర్పంచ్ లక్ష్మణ్, ఎంపీటీసీ గంగారెడ్డి, గోపాల మిత్రలు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



ప్రశంసాపత్రాలతో విద్యార్థినులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్ చైతన్య టెక్నో పాఠశాలలో గురువారం నాసా సంబంధించిన కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు భవిష్యత్తులో అంతరిక్షానికి సంబంధించిన విషయాలను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ప్రిన్సిపాల్ సచిన్ తెలిపారు. విజేతలైన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పవిత్ర



నడికుడలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ



రాయికల్ మండలం ఆలూర్‌లో..

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి
- పలు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన సదస్సులు

జగిత్యాల రూరల్: తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీపూర్‌లో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్, వీడియోలను ప్రదర్శించి తల్లిపాలు ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెరుకు జాన్, ఏఎన్ఎం ఫాతిమా, అంగన్‌వాడీ టీచర్లు జయప్రద, సునీత, పద్మజ, జలజ, రాజమణి, సరిత పాల్గొన్నారు.

తల్లిపాలతో ఆరోగ్యం

జగిత్యాల రూరల్: తల్లిపాలతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూపరాణి అన్నారు. తిప్పన్నపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు, సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీపీ ములాసపు లక్ష్మి, సర్పంచ్ రౌతు జయ పాల్గొన్నారు.

జగిత్యాల: పట్టణంలోని భీరయ్య గుడి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. సీడీపీవో వీరలక్ష్మి, సూపర్‌వైజర్ స్వరూప, అంగన్‌వాడీ టీచర్లు మాధవి, రజిత, సుజాత, పద్మ, పాల్గొన్నారు.

నడికుడలో..

మల్లాపూర్ : తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. నడికుడలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్‌లు భూక్య రుక్మా, ఉపసర్పంచ్ దేవుడి గంగాధర్, పంచాయతీ కార్యదర్శి సంతోషిణి, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మనాల, పోతారం గ్రామాల్లో..

మల్యాల: మండలంలోని మానాల, పోతారం గ్రామాల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పిల్లలకు అన్న ప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. సూపర్‌వైజర్ పవిత్ర, అంగన్‌వాడీ టీచర్ రత్నకుమారి, అనిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సీడీపీవో తిరుమలదేవి, సూపర్‌వైజర్ ప్రేమలత, వైద్యాధికారి రాధ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : మండలంలోని యామాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతం చేశారు. సర్పంచ్ మనీష, ఎంపీటీసీ వివేకవర్ధిని, ఏఎన్ఎం సుప్రియ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ : మండలంలోని ఆలూర్ కుమ్మరిపల్లిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతలపల్లి స్వప్న, ఆలూర్‌లో నాయకులు రాంరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు వనిత, పద్మ ఉమ, గోదావరి, సుజాత పాల్గొన్నారు.

కథలాపూర్‌లో..

కథలాపూర్: మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యత గురించి వివరించారు. సూపర్‌వైజర్ రాధిక, సర్పంచ్ కంటె నీరజ, అంగన్‌వాడీ టీచర్ జల, శారద, రాజేశ్వరి పాల్గొన్నారు.

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎడ్ల సృజన సుశీన్, సర్పంచ్ ప్రభాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నీలిమా, హెల్త్ సూపర్‌వైజర్లు డాక్టర్ లక్ష్మీ, ఆశా రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు కళావతి, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



బుగ్గారంలో సీఎం కేసీఆర్, మంత్రి ఈశ్వర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు



అంతర్గాంలో...

రైతు సంక్షేమమే ప్రభుత్వమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ప్రభుత్వం రుణమాఫీ ప్రకటన చేయడాన్ని హర్షిస్తూ జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి, చొప్పదండి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వేలాది మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. అనంతరం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై వివరించారు. మంత్రి, ఈశ్వర్, ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ కవిత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

–సాక్షి నెట్‌వర్క్

చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలి



కథలాపూర్‌లో విద్యార్థులకు నులిపురుగు మాత్ర వేస్తున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బాపురెడ్డి,



పెగడపల్లిలో జెడ్పీటీసీ సభ్యుడు రాజేందర్‌రావు



చిన్నారికి మాత్ర వేస్తున్న వైద్యురాలు



అల్బెండజోల్ మాత్ర వేస్తున్న వైద్యుడు రమేశ్

ఇబ్రహీంపట్నం/వెల్గటూర్/ కథలాపూర్/పెగడపల్లి/ కోరుట్ల/ జగిత్యాలరూరల్ /రాయికల్ / మల్లాపూర్ / ధర్మపురి : చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలని పలువురు వైద్య సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా 19 ఏళ్లలోపు చిన్నారులందరికీ నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. నులిపురుగులతో పోషకాహారం, రక్తహీనతతో బాధపడుతారన్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాలన్నారు. ఆయా కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో లావణ్య

మల్లాపూర్ : పంటలకు చీడపీడలు, తెగుళ్ల నివారణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి (ఏవో) లావణ్య అన్నారు. గురువారం మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో మక్కజొన్న, సోయాబిన్ పంటలను వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మోతాదు మించకుండా ఎరువులు వాడాలన్నారు. పంటల సాగులో మెళకువలు పాటించాలన్నారు. ఏఈవో వంశీ, రైతులు బద్దం కమలాకర్ రెడ్డి, సరసాని నారాయణ రెడ్డి, బద్దం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తొలిమెట్టుపై శిక్షణ

గొల్లపల్లి: మల్లన్నపేట జెడ్పీ పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు తొలిమెట్టుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రణాళిక ప్రకారం బోధన చేస్తే విద్యార్థుల సామర్థ్యాలు పెరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌పీ జూపాక సుదర్శన్, ఎంఈవో జమున, గంగనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో చేరాలని ప్రచారం

ఇబ్రహీంపట్నం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు యువతీ యువకులు ముందుకురావాలని మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయ కౌన్సిలర్ కడకుండ్ల దశరథం ప్రచారం నిర్వహించారు. 2023–24 సంవత్సరానికి గాను డిగ్రీలో చేరాలని కోరారు.

తారెత్తిస్తున్న టమాట



- కిలోకు రూ.200పైనే ధర
- కొనుగోలు చేయలేని స్థితిలో సామాన్యులు
- చికెన్ వైపు మొగ్గు చూపుతున్న ప్రజలు

రాయికల్: 'ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేట్టు లేదు. ఒకప్పుడు టమాట అంటే రూపాయి, రెండు రూపాయలకు కిలో చివరికి రూ.10 కిలో వరకు పలికేది. సరైన మద్దతు ధర లేక టమాట రైతులు టమాటను తెంపలేక పశువులకు పశుగ్రాసంగా వదిలిపెట్టేవారు. ప్రస్తుతం పరిస్థితి మారింది. టమాట ధర తగ్గేదేలేదంటూ రికార్డుస్థాయిలో ధర పలికుతోంది. గురువారం కిలో టమాట రూ.200 పలికింది. దీంతో సామాన్యులు ఒక టమాట సగటు విలువ రూ.20 పలుకుతుంది.

పైపైకి కూరగాయల ధరలు

ఒకవైపు ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు పండించిన కూరగాయల పంటలు తీవ్రంగా నష్టపోయారు. దీంతో ఉత్పత్తి సరిగా లేకపోవడంతో కూరగాయల ధరలు సైతం ఆకాశాన్నంటాయి. మార్కెట్‌లో కిలో టమాట రూ.200, ఎలిగడ్డలు రూ.150, మిర్చి రూ.100, బీరకాయలు రూ.120, చిక్కుడు కాయ రూ.100, క్యారెట్ రూ.100, ఉల్లిగడ్డలు రూ.40–50, కాలిఫ్లవర్ రూ.60 ధరలు పలుకుతున్నాయి.

చికెన్‌తో సమానంగా

చికెన్‌తో సమానంగా టమాట ధర పలుకుతోంది. కిలో చికెన్ ధర రూ.180 ఉండగా, టమాట ధర రూ.180 నుంచి రూ.200 వరకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. దీంతో చాలామంది సామాన్యులు టమాట ధరను చూసి భయపడి చికెన్ వైపే మొగ్గు చూపుతున్నారు. గత 20 ఏళ్లుగా ఈ ధరలు చూడలేమని టమాట రైతులు పేర్కొంటున్నారు.

కొనలేకపోతున్నాం



టమాట ధర చూస్తేనే భయం వేస్తోంది. కిలో టమాటలు మార్కెట్‌లో రూ.180 నుంచి రూ.200 పలకడంతో కొనుగోలు చేయాలంటేనే భయపడుతున్నారు. సామాన్యులు ప్రజలు కేవలం అత్యవసరమైతేనే కొనుగోలు చేస్తున్నాం.

– లావణ్య, గృహిణి, రాయికల్

టమాటలు అమ్మడం లేదు



టమాటాలు కొనేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ధరలు పెరగడంతో కూరగాయల వ్యాపారస్తులు సైతం టమాటాలు విక్రయించడానికి భయపడుతున్నాం. ఒకపెట్టెలో సుమారు రెండు కిలోలు చెడిపోయినా రూ.400 నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

– అశోక్, కూరగాయల వ్యాపారి రాయికల్

ఉచిత కంటి వైద్య శిబిరం



శస్త్ర చికిత్సకు తరలివెళ్తున్న రోగులు

పెగడపల్లి: మండలంలోని ఎల్లాపూర్‌లో కరీంనగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆస్పత్రి సిబ్బంది గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో సుమారు వందమందికి కంటి పరీక్షలు చేశారు. శస్త్ర చికిత్స అవసరమున్న వారిని కంటి ఆస్పత్రికి తరలించినట్లు లయన్స్ క్లబ్ చైర్మెన్ కొండ వేణుమూర్తి తెలిపారు. జెడ్పీటీసీ రాజేందర్‌రావు, సర్పంచ్ అంజమ్మ, ఎంపీవో మహేందర్, ఉప సర్పంచులు గంగాధర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు సురేందర్ రావు, రవి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు పరిహారం అందించాలి



దీక్షలో పాల్గొన్న నక్క విజయ్ కుమార్

వెల్గటూర్ : భభూ నిర్వాసితులకు పరిహారం అందించాలని నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి నక్క విజయ్ కుమార్ అరోపించారు. గురువారం ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామం చెగ్యాం భూ నిర్వాసితులు చేస్తున్న రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో భాగంగా భూములు కోల్పోయిన చెగ్యాం గ్రామస్తుల్లో 135 కుటుంబాలకు ఏళ్లు గడిచినా పరిహారం అందక అధికారులు తిరుగుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే భూములు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం అందించాలని, లేకపోతే రానున్న రోజుల్లో బీఎస్పీ స్టేట్ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడు కుషనపల్లి శ్రీనివాస్, వెలగటూర్ మండల అధ్యక్షుడు బచ్చల స్వామి, నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కొమొరెడ్డి విజయ్ ఆజాద్

మల్లాపూర్ : మండలంలోని వాల్గొండలో గుగ్లావత్ హరినాయక్ గోదావరి నదిలో చేపల వేటకోసం కూలికి వెళ్లి మృతిచెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొమొరెడ్డి విజయ్ ఆజాద్ కాంగ్రెస్ నాయకులతో కలిసి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ కాంగ్రెస్ నాయకులు, స్థానికులు తదితరులున్నారు.

అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న సురభి నవీన్‌కుమార్

ఇబ్రహీంపట్నం : బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా యువమోర్చా కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్‌కుమార్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో పార్టీ కార్యాలయంలో యువమోర్చా మండల కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమంలో యువమోర్చా జిల్లా అధ్యక్షుడు రెంటం జగదీశ్, బీజేపీ మండల అధ్యక్షుడు భట్టు జకరయ్య, ప్రధాన కార్యదర్శులు, రాజు, బాలు, నాయకులు పుస్తెం పుస్తెం రాజు, నీరేటి రవి, పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతు



బీర్‌పూర్‌లో జీపీ కార్మికుల సమ్మెకు సంఘీభావం ప్రకటిస్తున్న సర్పంచ్, తదితరులు

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగుతుండగా, అన్ని గ్రామాల్లో అధికార, ప్రతిపక్ష సర్పంచులు సమ్మెకు మద్దతు తెలుపుతూ వారికి సంఘీభావం ప్రకటిస్తున్నారు. గ్రామాల పరిశుభ్రతకు శ్రమిస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సర్పంచ్‌లు కోరుతున్నారు.

పాఠశాలకు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్ల వితరణ

వెల్గటూర్ : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో తమ తండ్రి పెద్ది గౌరయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీనివాస్, సురేశ్ 6 ఫ్యాన్లు, 5 ఎల్ఈడీ ట్యూబ్‌లైట్లు, 3 ఐమాక్స్ లైట్లు తల్లి పెద్ది ప్రమీల చేతుల మీదుగా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ మోకెన దీపకు అందజేశారు. కార్యక్రమంలో కుమ్మరిపల్లి సర్పంచ్ కొప్పుల విద్యాసాగర్, వెల్గటూర్ ఉపసర్పంచ్ గుండాటి సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి రిమాండ్

రాయికల్(జగిత్యాల): విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మండలంలోని చింతలూర్ గ్రామంలో అటవీశాఖ అధికారుల విధులకు అంటకం కల్గించిన జటోత్ రాజునాయక్ అతడి భార్య జూలిలను గురువారం రిమాండ్‌కు తరలించిన్నట్లు ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు.